పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి

ఏపీ లైబ్రరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శారద


విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఏపీ లైబ్రరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శారద

తాడేపల్లిరూరల్: విద్యార్థి దశ నుంచే పుస్తకాలు చదివే అలవాటు పెంచుకోవాలని ఏపీ లైబ్రరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.శారద అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ పుణ్యమా అని విద్యార్థుల్లో పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతోందని, విద్యార్థులు పుస్తకాలను చదివే అలవాటును మరింతగా పెంచుకోవాలని సూచించారు. పుస్తక పఠం అలవరచుకోవడం వలన విషయాలపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజు ఏదో ఒక పుస్తకాన్ని చదవడం ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సీ అండ్ డీ డీన్ డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో సెంట్రల్ లైబ్రరీలో అత్యాధునిక టెక్నాలజీని అనుసంధానం చేసి పూర్తిగా కంప్యూటరైజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం అత్యధిక పుస్తకాలను తమ యూనివర్సిటీ గ్రంథాలయంలో చదివిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, డాక్టర్ బ్రహ్మాచారి, డాక్టర్ ఇంతియాజ్, ఇన్‌చార్జి ప్రొఫెసర్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మంగళగిరి: గ్రంథాలయాలు విజ్ఞాన భండాగారాలని వాటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళగిరి శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఆవశ్యకత ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీఎస్కే శర్మ, వై.నాగకుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు పి.కృష్ణ, ఎన్.ఆరోగ్యం, నవీన్, నజీర్ పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

నూతక్కి..

నగర పరిధిలోని నూతక్కి శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ స్కూలు ఉపాధ్యాయులు బి.మాధురి, కె.గౌతమి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా గ్రంథాలయ నిర్వాహకులు వై.నరసింహారావు పర్యవేక్షించారు.


తుళ్లూరులో అవగాహన ర్యాలీ

తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో..

తాడేపల్లిరూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి షేక్ నాగుర్ బాషా మాట్లాడుతూ జూనియర్స్ విభాగంలో విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. న్యాయ నిర్ణేతలుగా బి.నాగరాజు, బి.లక్ష్మి, పద్మావతి వ్యవహరించారు.

తుళ్లూరులో..

తాడికొండ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయవచ్చని తాడికొండ గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు, తుళ్ళూరు గ్రంథాలయాధికారి టి.గిరిధర్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తాడికొండ, తుళ్లూరులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తుళ్లూరులో వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసిన అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించగా తాడికొండలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంరథాలయ సిబ్బంది జి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అల్లంవారి పాలెం జెడ్పీహెచ్ పాఠశాల, సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం , తెలుగు మీడియం పాఠశాలలకు చెందిన 54 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నట్లు గ్రంథాలయ ఇన్‌చార్జి పి.జేమ్స్ తెలిపారు. కార్యక్రమాలను పుస్తక పంపిణీ కేంద్రం నిర్వాహకులు సైదాసాహెబ్, దివి కృష్ణ మూర్తి పర్యవేక్షించారు.



ముగిసిన పాన్ ఇండియా కార్యశాల



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాన్ ఇండియా వర్క్ షాప్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ఆన్‌లైన్ ద్వారా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆధునిక టెక్నాలజీ రంగంలో కొత్తపుంతలు తొక్కుతున్న ప్రపంచానికి భారత్ దిక్సూచి కావాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా ఇంజినీరింగ్ విద్యార్థులు పరిశోధనలు చేసేలా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని కోరారు. పాన్ ఇండియా కార్యశాల కన్వీనర్లు ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.పాండియన్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ సెంథిల్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సిడాక్), ఐ ట్రిపుల్ ఈ ఇండియా కౌన్సిల్, ఎలక్ట్రానిక్స్ మరియు కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖల భాగస్వామ్యంతో కేఎల్‌యూలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యశాలలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, ప్రొఫెసర్ హరి కిరణ్, కార్యక్రమ కో ఆర్డినేటర్లు స్వప్న, ఆర్‌బీఆర్ ప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

27, 28 తేదీల్లో మహాధర్నా

తాడేపల్లిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 27,28 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు కోరారు. నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి అమరారెడ్డి భవన్‌లో సంఘం మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ప్రధాని మోదీ గతంలో ప్రకటించారని, కానీ నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. సమగ్ర పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించి చట్టబద్ధత కల్పించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని, కార్మిక హక్కులను పునరుద్ధరించాలని తదితర అంశాలపై నిర్వహించే మహా ధర్నాకు రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పల్లె కృష్ణ, బుల్లికోటి, బుర్రముక్కు శివారెడ్డి, సీఐటీయూ నాయకులు బూరగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వడ్డెరలకు టీడీపీ క్షమాపణలు చెప్పాలి

మంగళగిరి: బీసీలను అవమానపరచడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందని వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల కృష్ణ కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని వడ్డెరలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వడ్డెరలను నమ్మలేమంటూ బీకే పార్థసారథి అవమానపరడం సిగ్గుచేటన్నారు. 2019 తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వడ్డెరలను ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించడంతో వడ్డెరలు రాజకీయంగా ఎదుగుతున్నారనే అక్కసు తట్టుకోలేక పార్థసారథి వడ్డెరలను కించపరచేలా మాట్లాడారన్నారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనకు విద్య నేర్పిన గురువు వెంకటప్పయ్య, వడ్డెర అయినా ఆయన పేరుతో స్కూలు స్థాపించి వడ్డెరలకు గౌరవం కల్పించారన్నారు. వడ్డెరలకు పదవులు కేటాయించి ఉన్నత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న 2024 ఎన్నికలలోను రాష్ట్రంలోని వడ్డెరలంతా అండగా ఉండి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

పౌష్టికాహారం పంపిణీ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని దుగ్గిరాల, ఈమని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. టీబీ తెనాలి యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ ఐటీసీ కంపెనీ మరియు నాట్కో వారి ఆర్థిక సహకారంతో జిల్లా క్షయ నివారణ అధికారుల సూచనల మేరకు క్షయవ్యాధి గ్రస్తులకు కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్బారావు, సీహెచ్‌ఓ ఎ.జానమ్మ, ఈమని మెడికల్ ఆఫీసర్-2 డాక్టర్ ఎ.సుకన్య, దుగ్గిరాల పాల్గొన్నారు.

ఇప్పటంలో రేషన్ షాపు తనిఖీ



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో రేషన్ దుకాణాన్ని డీఎస్‌ఓ కోమలి పద్మ శనివారం తనిఖీ చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు రేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొంత కాలంగా ఇప్పటంలో 21వ రేషన్ షాపు నిర్వహిస్తున్న శివరమణ కుమారి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా వేలిముద్రలు వేయించుకుని, డబ్బులు ఇస్తామంటూ చెబుతోందని, జరిగిన ఈ ఘటనపై కొందరు ఫిర్యాదు చేయడంతో షాపు తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ షాపులో లబ్ధిదారులకు ఇవ్వకుండా మిగిల్చిన బియ్యం 900 కేజీలు గుర్తించినట్లు పేర్కొన్నారు. పంచదార అర కిలో ప్యాకెట్లు 150 గుర్తించి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీల్లో మంగళగిరి సీఎస్‌టీడీ దుర్గారావు, వీఆర్‌ఓ ప్రసాద్ పాల్గొన్నారు. తనిఖీ ప్రాంతంలో వేలిముద్రలు వేసుకుని బియ్యం ఇవ్వని వారిని కలిసి వివరాలు సేకరించారు.

బాలిక ఊపిరి తీసిన ఉయ్యాల

బాలిక ఉయ్యాల ఊగుతున్న సమయంలో మెడికు ఉరి పడి మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజీవ్‌గాంధీనగర్ 3వ లైనులో అచ్చమ్మ నివాసం ఉంటోంది. ఆమె వద్ద మనుమరాలు బొంత కావ్య తిరుపతి (12) ఉంటోంది. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కావ్య ఉయ్యాలలో ఆడుకుంటూ మెలికలు తిరుగుతూ ఉండగా, ప్రమాదవశాత్తు మెడకు ముడిపడింది. ఈ ప్రమాదంలో కావ్య మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలలో చలపతి విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, కంపెనీ ప్రతినిధులు

మోతడక(తాడికొండ): హైదరాబాద్‌కు చెందిన సూర్యటెక్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో తమ కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థులు ట్రైనీ ఇంజినీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టి.కిరణ్ కుమార్ తెలిపారు. కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో కంపెనీ హెచ్‌ఆర్ బృందం ఆధ్వర్యంలో ఆప్టిట్యూడ్, టెక్నికల్ టెస్ట్, ముఖాముఖి ఇంటర్వ్యూ ద్వారా నిర్వహించి 48 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇచ్చేందుకు కంపెనీతో ఒప్పందం కుదిరిందని, కళాశాలలో చదువుతో పాటు ప్రణాళిక ప్రకారం ఉపాధి శిక్షణ, వ్యక్తిత్వ శిక్షణ తరగతులు నిర్వహించడం ద్వారా వారిలో సామర్థ్యాలను పెంపొందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.నాగ శ్రీనివాసరావు, ఉపాధి కల్పనాధికారి ఎ.ధర్మతేజ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వలన కలిగే శారీరక, మానసిక సమస్యలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.రవికుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ప్రభావం బాలలపై ఎక్కువగా ప్రభావం చూపుతుందని, ముందు జాగ్రత్తతోనే మాదక ద్రవ్యాల అలవాటు మరియు ఆలోచనలపై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావచ్చని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, ఉపాధ్యాయులు జి.శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్


విద్యుత్ వినియోగదారుల సమస్యలు వింటున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

రాయపూడి(తాడికొండ): విద్యుత్ వినియోగదారుల అదాలత్‌లో వినియోగదారుల సమస్యలు అక్కడికక్కడే సత్వర పరిష్కారం లభిస్తుందని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మాన్యుయేల్ అన్నారు. శనివారం తుళ్లూరు మండలం రాయపూడి విద్యుత్ చేతన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విద్యుత్ అదాలత్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అధిక బిల్లులు, తప్పుడు రీడింగ్ బిల్లులు, సర్వీసుల్లో జాప్యం, లో బడ్జెట్ సమస్యలు, సరఫరాలో హెచ్చుతగ్గులు, పోల్స్ సమస్యలు ఉన్న 8 మందికి సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ సాంకేతిక సభ్యులు కె.వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు ఎ.సునీత, సీఆర్డీయే సర్కిల్ ఎస్‌ఈ పి.విజయ్ కుమార్, అమరావతి ఈఈ టీవీ తులసీ రామ్ పాల్గొన్నారు.

నగరంలో రహదారుల విస్తరణ వేగవంతం

మేయర్ కావటి


పనులను పరిశీలిస్తున్న మేయర్

నగరంపాలెం: గతంలో కంటే ప్రస్తుతం గుంటూరు నగరంలో రహదారుల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నట్లు నగర మేయర్ కావటి మనోహర్ నాయడు తెలిపారు. ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి విస్తరణ పనుల్ని శనివారం ప్రజా ప్రతినిధులు, జీఎంసీ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలోని ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి చాలా కీలకమైనదని తెలిపారు. 24, 30, 31 డివిజన్లతో పాటు పల్నాడు జిల్లా వైపు నుంచి గుంటూరు నగరంలోకి ప్రవేశించేందుకు అనువైన రహదారని పేర్కొన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్ష మేరకు రూ.13 కోట్లతో 80 అడుగుల మేరకు రహదారి విస్తరణ చేపడుతున్నామని చెప్పారు. విస్తరణలో 182 గృహాలు ఉండగా, అందులో సుమారు 170 మంది స్థలాలు ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. మిగతా కొందరు కోర్టుకు వెళ్లడంతో రహదారి నిర్మాణ పనులు స్తంభించాయని చెప్పారు. త్వరలో వారి ఆమోదంతో త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. రహదారిని విస్తరించి సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, డ్రైయిన్లను నిర్మించి, ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతామని చెప్పారు. గుంటూరు నగరంలో వైఎస్ఆర్ సీపీ పాలకవర్గం ఏర్పడిన తరువాత సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు కుల, మత, పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో 2014–2019 వరకు భూగర్భ డ్రైనేజీ పనులతో నగరాన్ని గుంతలూరుగా మార్చారని ఆరోపించారు. నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ దృష్ట్యా నగరంలో పలు ప్రధాన రహదారుల్ని విస్తరిస్తున్నామని తెలిపారు. అందులో ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి, పలకలూరు రహదారి, రామనామక్షేత్రం, కొత్తపేట శివాలయం, కేవీపీ కాలనీ రహదారులు ఉన్నాయని చెప్పారు. ఎక్కువ శాతం నిర్మాణ పనులు పూర్తి చేశామని తెలియజేశారు. టీడీపీ, జనసేన ఎన్ని అసత్య ఆరోపణలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రజలు వై.ఎస్.జగన్‌ను మరల సీఎంగా ఎన్నుకుంటారని మేయర్ కావటి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకట్‌రెడ్డి, అడకా పద్మావతి, జీఎంసీ ఎస్‌ఈ భాస్కరరావు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ చంద్రశేఖర్



తాడికొండ: విద్యార్థి దశలో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా చదువుతో పాటు సామాజిక స్పృహ, దేహ దారుఢ్యం పెంపొందించుకొని ఉన్నతంగా రాణించవచ్చని గుంటూరు హెడ్ క్వార్టర్ ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్ కల్నల్ చంద్రశేఖర్ అన్నారు. తాడికొండ మండలం లాం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలకు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాల వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అవకాశాలను అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, ప్రియాంక పాల్గొన్నారు.

నేడు సర్రాజు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానం

గుంటూరు వెస్ట్: సర్రాజు వేణుగోపాలరావు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రధానోత్సవాన్ని ఆదివార స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ విలువలతో ఉపాధ్యాయ వృత్తికే గౌరవం తెచ్చిన గోపాలరావు పేరుతో ఏటా తమ కుటుంబ సభ్యులు ప్రతిభ ఉన్న కొందరిని ఎంపిక చేసి యశస్వి పురస్కారంతో సత్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది అవార్డులను నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ఎంపీ యూపీఎస్ లేమల్లెపాడు ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, చలనచిత్ర దర్శకుడు ఎస్.వై. గౌతం రాజులకు అందజేస్తామని తెలిపారు.

బాలోత్సవాల బ్రోచర్ల పంపిణీ

తాడేపల్లిరూరల్: డిసెంబర్‌లో జరుగనున్న బాలోత్సవాల బ్రోచర్లను శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని పలు పాఠశాలలకు బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 19,20 తేదీల్లో మంగళగిరి సమీపంలోని డాన్‌బాస్కో హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిత్రా రామారావు, రాజు మాస్టర్, జ్యోతిపాల్ పాల్గొన్నారు.


పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు బాలోత్సవం బ్రోచర్‌ను అందజేస్తున్న దృశ్యం

కత్తితో ఇద్దరిపై దాడి


గుంటూరు ఈస్ట్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి సమీప బంధువులపై దాడి చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 17న సాయిబాబా రోడ్డులోని ఇంటిలో మర్రిపూడి సైదులు టీవీ చూస్తున్న సమయంలో సమీప బంధువు అయిన రిత్విక్ కత్తితో దాడి చేశాడు. వీరి మధ్య కుటుంబ కలహాలు ఉన్నాయి. సైదులు పెద్దగా కేకలు వేయడంతో అతని సోదరుడు అక్కడకు వచ్చి రిత్విక్‌ను అడ్డుకోబోయాడు. అతని పైనా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నెహ్రూనగర్: అనారోగ్యంతో మృతి చెందిన ఇద్దరు ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు గుంటూరు డిస్ట్రిక్ట్ ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని ఆ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో పనిచేస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది సహకారంతో హెడ్ కానిస్టేబుళ్ల ఆర్. శ్రీనివాసరావు, ఐ. వి. భూపతి కుటుంబ సభ్యులకు రూ.95 వేలు చొప్పున ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వెంకటరామిరెడ్డి, పల్నాడు జిల్లా సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షుడు మార్పు కోటయ్య, అసోసియేషన్ నాయకులు బి.ఎస్.ఎన్. రాజు, శ్రీమన్నారాయణ, శంకరరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అగౌరవం, వ్యంగ్యంగా పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు



గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నటుడు పోసాని కృష్ణ మురళి, గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజులపై ఫేస్‌బుక్‌లో ఓ వ్యక్తి వ్యంగ్యంగా, అగౌరవంగా పోస్టులు పెట్టడంపై న్యాయవాదులు అరండల్‌పేట పోలీసుస్టేషన్ శనివారం ఎస్‌హెచ్‌ఓ రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. న్యాయవాది వేముల ప్రసాద్ మాట్లాడుతూ అడుసుమల్లి వెంకట అప్పారావు ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి, ఐజీ, సినీనటుడు పోసాని కృష్ణమురళిపై వ్యంగ్యంగా పోస్టులు పెట్టి అగౌరపరిచాడని తెలిపారు. ఒక రాజకీయ పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా ఫేస్‌బుక్‌లో అప్లోడ్ చేశారని పేర్కొన్నారు. వెంకట అప్పారావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఫేస్‌బుక్‌లో తప్పుడు పోస్టర్లు పెట్టడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. న్యాయవాదులు బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, బి.కోటేశ్వరరావు, సీడీ భగవాన్, క్రాంతికుమార్, జయపాల్, శ్రీనివాసరెడ్డి, షేక్ నజీర, కృష్ణారెడ్డి తదితరులు స్టేషన్‌కు వచ్చిన వారిలో ఉన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

పట్నంబజారు: నగరం అభివృద్ధి పనులతో శరవేగంగా ముందుకు సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మురళి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా శనివారం నందివెలుగు రోడ్డులో జరుగుతున్న మరమ్మతుల్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నందివెలుగు రోడ్డును అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, ఇత్రి సాయి, ఎర్రబాబు పాల్గొన్నారు.